తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 139 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 19 -12-2024 వెల: 5/రూ -



# ఆటోల్లో అసెంబ్లీకి..!

**ఖాకీ చొక్కాలు ధరించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**

**ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**'అదానీ వ్యవహారంలో' సీఎం వ్యాఖ్యలపై మెరుపు నిరసన**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై రోజుకో రూపంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు ఉదయం 9.30కు చేరుకున్న నేతలు ఖాకీ చొక్కాలు ధరించి ఆటోల్లో అసెంబ్లీకి బయలుదేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, బండారి లక్ష్మారెడ్డి స్వయంగా ఆటోలు నడిపారు. మార్గంమధ్యలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన వాహనాన్ని ఆపి నిరసన తీరు బాగుంది అంటూ వీడియో తీసుకున్నారు. కాగా బీఆర్ఎస్ జెండాలతో కూడిన ఆటోలతో పలువురు ఆటో కార్మికులు కేటీఆర్ నడుపుతున్న ఆటోను అనుసరిస్తూ అసెంబ్లీ వద్దకు చేరుకున్నారు. ప్రవేశ ద్వారం వద్ద ఆటోలను పోలీసులు అడ్డుకోవడంతో ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ సభకు వచ్చారు. అంతకుముందు ఆదర్శనగర్ క్వార్టర్స్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలేమయ్యాయి?

2లో



# 'జల్‌జీవన్'లో జనం భాగస్వామ్యం

**వారి ఫిర్యాదులు, సూచనలకు పెద్దపీట**

**గత పాలకుల తీరుతో పథకం అస్తవ్యస్తం**

- 5 లక్షలతో అయ్యే పనులూ పెండింగ్‌లోనే..
- కోటి మందికి రక్షిత తాగునీరు కూటమి లక్ష్యం
- త్వరలో కేంద్రానికి 70 వేల కోట్లతో ప్రతిపాదనలు
- కొత్త నీటి వనరుల సృష్టికి సమష్టిగా పనిచేద్దాం
- వర్క్‌షాపులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు

అమరావతి: జల్‌జీవన్ మిషన్ పనుల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. ఇప్పుడున్న నీటి వనరులకు

2లో



# రంగంలోకి ఈడీ!

**వైవీ తనయుడికి నోటీసులు!**

**కాకినాడ పోర్టు కేసులో మరో మలుపు**

కేవీ రావు ఫిర్యాదు మేరకు సీఐడీ వై.విక్రాంత్ రెడ్డి (వైవీ సుబ్బారెడ్డి కుమారుడు)ని ఏ1గా పేర్కొంటూ కేసు నమోదు చేసింది.

2లో

## సామాన్యుడి భూహక్కుల పరిరక్షణకే భూభారతి



# అదానీకి ప్రధాని అండ




- ఇద్దరూ కలిసి దేశం పరువు తీశారు
- కాంగ్రెస్ 75 ఏళ్లలో పెంచిన ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు
- అదానీ అవినీతిపై జేపీసీ ఎందుకు వేయడంలేదు?
- బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ, ప్రధాని వైపా?
- ఆ పార్టీ వైఖరేంటో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ చెప్పాలి
- మోదీ జైల్లో పెడతారనే భయంతోనే మాట్లాడటం లేదు
- నిరసన తెలిపే హక్కు సీఎంకూ ఉంటుంది: రేవంత్‌రెడ్డి
- టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్
- లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ ముందు రోడ్డుపై సీఎం బైఠాయింపు



# అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు!

**కాంగ్రెస్ బండారాన్ని అమిత్‌షా బయటపెట్టారు .. దాంతోనే కొత్త నాటకాలు.. ప్రధాని మోదీ ఆగ్రహం**

- హోం మంత్రి వ్యాఖ్యలకు సమర్థన
- అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఎన్నటికీ మాట్లాడను: అమిత్‌షా

2లో


# బదులివ్వలేకే దుష్ప్రచారం

- నా వ్యాఖ్యలను వక్రీకరించారు
- కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం
- ఆ పార్టీ ఫక్తు అంబేడ్కర్ వ్యతిరేకి
- ఆ వాస్తవాలను సభలోనే నిరూపించాం
- ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు
- అంబేడ్కర్‌ను కలలోనైనా అవమానించను.. ఆయన సిద్ధాంతాలనే ప్రచారం చేస్తున్నాం



న్యూఢిల్లీ: అంబేడ్కర్‌పై రాజ్యసభలో తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పూర్తిగా వక్రీకరించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. "కాంగ్రెస్ పార్టీ ఫక్తు అంబేడ్కర్ వ్యతిరేకి. రాజ్యాంగ వ్యతిరేకి. రిజర్వేషన్ల వ్యతిరేకి. ఈ వాస్తవాలను రాజ్యాంగంపై చర్చ సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా నిరూపించాం. మేం లేవనెత్తిన అంశాలకు కాంగ్రెస్ వద్ద ఏ సమాధానమూ లేకపోయింది. అందుకే తీవ్ర అసహనంతో ఇలా తప్పుడు దారి ఎంచుకుంది.ప్రధాని వ్యాఖ్యలను కూడా ఇలాగే వక్రీకరిస్తోంది.

2లో



# ముంబై సముద్రతీరంలో పడవ ప్రమాదం

ముంబై సముద్రతీరంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. 'గేట్‌వే ఆఫ్ ఇండియా' నుంచి ప్రసిద్ధి చెందిన ఎలిఫెంటా దీవులకు ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ అనే పడవను నేవీకి చెందిన బోటుప్రయాణికులతో

# ‘జల్‌జీవన్’లో జనం భాగస్వామ్యం

కొత్త రూపు తీసుకురావడంతో పాటు కొత్త నీటి వనరులను సృష్టించుకోవడం ఈ పథకం లక్ష్యం కావాలని వివరించారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటుచేసిన జల్‌జీవన్ మిషన్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. నీటి నిర్వహణ, సరఫరా విషయంలో పటిష్ఠమైన ప్రణాళిక ఉండాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే బృహత్తర ప్రణాళికతో అంతాకలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జల్‌జీవన్ మిషన్ పనులు ఎలా మొదలుపెట్టాలి, ఎలాముందుకు తీసుకెళ్లాలి, పటిష్ఠంగా ఎలా పూర్తి చేయాలనే విషయాలపై అధికార యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, పనులు చేసి వదిలేయడం కాకుండా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలు వినడానికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి ముందుకెళ్లాలని కోరారు. జల వనరుల లభ్యత, వాటి నుంచి పొందాల్సిన ప్రయోజనం, ఇతర అంశాలను నిశితంగా పరిశీలించి శాశ్వతంగా ఫలితాలు అందేలా జల్‌జీవన్ మిషన్ పనులను మొదలుపెట్టాలన్నారు. ఇంకా పవన్ కల్యాణ్ ఏమన్నారంటే..

**ఇప్పటికీ తాగునీటి వెతలు..**

స్వాతంత్ర్యానంతరం తాగునీటిని అందించేందుకు రూ.లక్షల కోట్లు ప్రభుత్వాలు ఖర్చు చేశాయి. అయినా ఇప్పటికీ తాగునీటి వెతలు తప్పడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకునే 2019లో జల్‌జీవన్ మిషన్ పథకం మేరకు మొదలైంది. ప్రతి మనిషికీ సగటున 55 లీటర్ల రక్షిత తాగునీరు అందించాలనేది పథకం లక్ష్యం. నేను ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా.. తాగునీరు అందడం లేదని జనం చెబుతున్నారు. జల్‌జీవన్ పనుల్లో గత ప్రభుత్వం అసలేం చేసిందనేదానిపై పల్స్ సర్వేను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అధికారులకు చెప్పాం. గత పాలకులు చెప్పిన లెక్కల్లో 70.04 లక్షల కుటుంబాలకు నీటి కుళాయిలు ఇచ్చారు... ఇంకా 25.40 లక్షల కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వాలి. కానీ, 85.22లక్షల కుటుంబాలకుగాను 55.37 లక్షల కుటుంబాలకు ఇంకా కుళాయిలు బిగించాల్సి ఉన్నదని పల్స్ సర్వేలో తేలింది.

**కేరళ కంటే తక్కువగా ప్రతిపాదనలు....**

“నేను వ్యక్తిగతంగా చాలా సార్లు జల్‌జీవన్ మిషన్ పనులను సమీక్షించాను. కానీ, ప్రజలందరికీ మేలు చేసే ఇంత కీలకమైన పథకం విషయంలో రాష్ట్రంలో అనుకున్నంత విజయవంతంగా పనులు జరగడంలేదు. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించే ముందు... ఎంతమేర ని?ధులు అవసరమవుతాయని కేంద్రం.. రాష్ట్రాలను అడిగాయి. ఉత్తరప్రదేశ్ రూ.1.50 లక్షల కోట్లు, మధ్యప్రదేశ్ రూ.83 వేల కోట్లు, గుజరాత్ రూ.32 వేల కోట్లు, కేరళ రూ.45 వేల కోట్లు కావాలని అడిగాయి. ఆంధ్రప్రదేశ్ కంటే కేరళ చాలా చిన్నది. అయినా, భవిష్యత్ అవసరాలు, ప్రజలకు అందాల్సిన పూర్తి తాగునీటి పనులు పూర్తి కావాలంటే నిధులు ఎక్కువ అవసరం అనే కోణంలో ఆలోచించి అంత మొత్తం ఆ రాష్ట్రం అడిగింది. కానీ, గత ప్రభుత్వ పాలకులు మాత్రం ఏపీకి రూ.26వేల కోట్లు చాలంటూ ప్రతిపాదనలు పంపారు. దీంతో కేంద్రం మొదటి దశలో రూ.4,787 కోట్ల పనులు మంజూరుచేసింది. కేంద్ర పథకాల్లో కచ్చితంగా రాష్ట్ర వాటాగా మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించాలనే నిబంధన ఉంటుంది. జల్‌జీవన్ మిషన్ పనులకు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో కేంద్రమిచ్చిన నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేకపోయాం.”

## ముంబై సముద్రతీరంలో పడవ ప్రమాదం

వెళ్తున్న నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొన్న నేవీ బోటు ముంబై, డిసెంబరు 18: ముంబై సముద్రతీరంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ‘గేట్‌వే ఆఫ్ ఇండియా’ నుంచి ప్రసిద్ధి చెందిన ఎలిఫెంటా దీవులకు ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ అనే పడవను నేవీకి చెందిన బోటు ఢీకొట్టిన ఘటనలో 13 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటనలో 101 మందిని కాపాడినట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ప్రయాణికులతో నీల్‌కమల్ ఫెర్రీ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన నేవీ స్పీడ్ బోటు ఢీకొట్టింది. దీంతో ఆ ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. నేవీ బోటుకు ఇటీవలే కొత్త ఇంజన్‌ను బిగించారు. దాన్ని పరీక్షిస్తున్న సమయంలో అది నియంత్రణ కోల్పోయి నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొట్టింది. నేవీ బోటులో ఆరుగురున్నారని, వీరిలో ఇద్దరు నేవీ సిబ్బంది, నలుగురు ఇంజన్ సరఫరా చేసిన కంపెనీకి చెందిన వారున్నారని తెలుస్తోంది.

## ఆటోల్లో అసెంబ్లీకి..!

‘అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 8 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి జాబితాను గత అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వానికి ఇచ్చినా స్పందించడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇవ్వడంతో పాటు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి..’అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు ఆటో డ్రైవర్ల సమస్యలతో కూడిన జాబితాను కేటీఆర్‌కు అందజేశారు. ఇలావుండగా ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు, హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ శాసనసభా పక్షం అసెంబ్లీలో వాయిదా తీర్మానం ఇచ్చింది. కాంగ్రెస్ చలో రాజ్‌భవన్ సందర్భంగా బీఆర్ఎస్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నిరసనకు దిగింది. సభ విరామ సమయంలో హరీశ్‌రావు నేతృత్వంలో లాబీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయం నుంచి ఒక్కసారిగా బయటకు వచ్చిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు అదానీ, రేవంత్‌రెడ్డి కలిసి ఉన్న ఫొటోలను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ‘గల్లీలో దోస్తీ.. ఢిల్లీలో కుస్తీ, అదానీ..సీఎం భాయ్..భాయ్’అంటూ నినదించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు చేరుకుని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాలు రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. శాసనమండలిలో బుధవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా.. మూసీ సుందరీకరణ అంశంపై సీఎం రేవంత్ తరఫున మంత్రి శ్రీధర్‌బాబు తప్పుడు సమాచారం ఇచ్చారని బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఆరోపించింది. ఎమ్మెల్సీ కవిత అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ.. మూసీ డీపీఆర్, ప్రపంచ బ్యాంకు నుంచి ఆర్థిక సాయం అంశంలో మంత్రి తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొంది.

# అదానీకి ప్రధాని అండ

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: అదానీ, ప్రధాని కలిసి ప్రపంచం ముందు మన దేశం పరువు తీశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో వ్యాపారం చేయాలంటే లంచం ఇవ్వాలనే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లు కష్టపడి పెంచిన దేశ ప్రతిష్ఠను ప్రధాని, అదానీ అనుబంధం దెబ్బతీస్తోందన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల వైపు ఉంటారా? అదానీ-ప్రధాని వైపు ఉంటారో చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీకి వ్యతిరేకంగా మాట్లాడితే మోదీ జైల్లో వేస్తారని కేసీఆర్ కుటుంబం భయపడుతోందన్నారు. అమెరికాలో అదానీపై నమోదైన కేసుల్లో, ఆర్థిక అవకతవకలపై జేపీసీ వేసి విచారణ జరపాలని, మణిపూర్‌లో తీవ్రమైన శాంతిభద్రతల సమస్య ఉన్నప్పటికీ ప్రధాని మోదీ ఇప్పటివరకు సందర్శించక పోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ ఆధ్వర్యంలో ‘ఛలో రాజ్‌భవన్’ కార్యక్రమం చేపట్టారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ రోటరీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు రాజ్‌భవన్‌కు ర్యాలీగా బయలుదేరారు. అయితే పోలీసులు రాజ్‌భవన్‌కు సమీపంలోనే బారికేడ్లు పెట్టి ర్యాలీని అడ్డుకున్నారు. దాంతో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ ముందే రోడ్డుపై బైఠాయించారు. ప్రధాని, అదానీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుందని తెలిపారు. దేశ పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలని, ఈ విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలని డిమాండ్ చేశారు. కానీ, అదానీ అవినీతిపై చర్చకు, జేపీసీ వేసేందుకు ప్రధాని మోదీ సిద్ధంగా లేరని అన్నారు. అలా చేస్తే అదానీ జైలుకు వెళ్లాల్సివస్తుందని ఆయనను కాపాడేందుకే మోదీ యత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

**ప్రజల వైపా? అదానీ, ప్రధాని వైపా?**

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రభుత్వమే ధర్నాలో కూర్చోవడమేంటని కొందరు అనుకోవచ్చని, కానీ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చట్టసభలను స్తంభింపజేసినా, ఎన్ని నిరసనలు చేపట్టినా మోదీ




దిగిరావడం లేదని, అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చిందని తెలిపారు. “ముఖ్యమంత్రి నిరసన ఎలా చేస్తాడని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. అయితే నేను చేయను.. మరి మీరు చేయాలి. అదానీ విషయంలో కేసీఆర్ విధానమేంటో చెప్పాలి. బీజేపీ పెద్దల కాళ్లు మొక్కి అరెస్టులను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీతో బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీపై వారు స్పందించడం లేదు. అదానీపై, జేపీసీపై మీ వైఖరేంటో చెప్పి.. మీ ఎంపీలతో లేఖ రాయించాలి” అని సీఎం రేవంత్ అన్నారు. మోదీ, కేసీఆర్ వేర్వేరు కాదని, నాణేనికి బొమ్మ, బొరుసు లాంటి వారని విమర్శించారు. బీఆర్ఎస్ జేపీసీపై డిమాండ్ చేస్తే అసెంబ్లీ తీర్మానం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ట్విటర్‌లో కారుకూతలు కూయకుండా చర్చకు రావాలని సవాల్ చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశ సంపదను, వనరులను బీజేపీ నాయకత్వానికి దగ్గరగా ఉండే కొద్దిమందికి దోచి పెట్టేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాగా, మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పటి నుంచే అదానీతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ అన్నారు. జాతి వివక్షతో మణిపూర్ రాష్ట్రం తగలబడుతున్నా మోదీ మౌనం దాలుస్తున్నారని మండిపడ్డారు.

# బదులివ్వలేకే దుష్ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

వాటిపై ఆందోళనలకు దిగుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతోంది” అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం రాజ్యసభలో అంబేద్కర్ గురించి తాను మాట్లాడినదాంట్లో ఎలాంటి సందిగ్ధతా లేదని స్పష్టం చేశారు. “రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కలలో సైతం అవమానపరచని పార్టీ నుంచి, సిద్ధాంతం నుంచి వచ్చాను. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడల్లా అంబేద్కర్ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేసింది. రిజర్వేషన్లను బలోపేతం చేసేందుకు కృషి చేసింది” అన్నారు. “కాంగ్రెస్ చర్యలు ఆక్షేపణీయం. నాపై ఆ పార్టీ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నా” అని చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా అన్ని అవకాశాలూ పరిశీలిస్తామన్నారు. అంబేద్కర్‌పై తాను చేసిన పూర్తి వ్యాఖ్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. అలాగే అంబేద్కర్‌కు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని కూడా ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే తన ప్రసంగంలో కేవలం కొంత భాగాన్ని మాత్రమే చూపిస్తోందని అమిత్ షా ఆక్షేపించారు. తద్వారా అయోమయం సృష్టించడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా కృత్రిమ మేధ సాయంతో తన వ్యాఖ్యలను, మోదీ వ్యాఖ్యలను వక్రీకరించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు.

‘అంబేద్కర్‌ను పూర్తిగా పక్కన పెట్టేందుకు ప్రయత్నించిన చరిత్ర తొలి ప్రధాని నెహ్రూది. నెహ్రూ కుటుంబంలో నాలుగు తరాల నేతలూ అంబేద్కర్‌ను వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. ఆయనకు భారతరత్నను వీలైనంతగా ఆలస్యం చేసింది కాంగ్రెసే. కనీసం ఇప్పుడైనా ఆ పార్టీ అంబేద్కర్ గురించి మాట్లాడుతుండడం ఆనందం కలిగిస్తోంది. అయితే అంబేద్కర్‌కు ఇన్నాళ్లూ వాళ్లు ఏమాత్రం గౌరవం ఇవ్వని విషయం కూడా చెబితే బాగుంటుంది” అన్నారు. చీలిక దిశగా పయనిస్తున్న విపక్ష ఇండియా కూటమికి తిరిగి ఒక్కటయ్యే అవకాశాన్ని మీ వ్యాఖ్యలు కల్పించాయా అని ప్రశ్నించగా తప్పుడు పునాదులపై ఒక్కతాటిపైకి రావడం వారికి అలవాటేనని అమిత్ షా అన్నారు. “ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. విపక్షాలకు వ్యతిరేకంగా వారు వరుసగా తీర్పులిస్తున్నారు. అందుకే ఓసారి ఈవీఎంలపై, మరోసారి ఇంకో అంశంపై ఆరోపణలు తదితరాలతో ప్రజలను అయోమయపరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి” అని ఆరోపించారు.

**బాక్సు ఖర్గే సంతోషిస్తానంటే తప్పుకుంటా**

తాను రాజీనామా చేయాలన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ హాస్యాస్పదమని అమిత్ షా అన్నారు. “నా రాజీనామా ఖర్గేకు సంతోషం కలిగిస్తుందంటే అలాగే చేస్తా.

## అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు!

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: ప్రతి దానికీ అంబేద్కర్ పేరు ప్రస్తావించడం కాంగ్రెసకు ఫ్యాషన్‌గా మారిందని.. ఆయన పేరు కాకుండా దేవుడిని స్మరించుకుంటే ఏడు జన్మలు స్వర్గం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ గట్టిగా సమర్థించారు. అంబేద్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు ఆ పార్టీ పన్నని కుట్ర లేదని విమర్శించారు. బాబాసాహెబ్‌ను అవమానించిన ఆ పార్టీ చరిత్రను, వాస్తవాల చిట్టాను షా రాజ్యసభలో బయటపెట్టారని.. అది చూసి కాంగ్రెస్ నేతలు బిత్తరపోయారని అన్నారు. అందుకే అంబేద్కర్‌ను ఆయన అవమానించారని, కేబినెట్ నుంచి బహిష్కరించాలంటూ కొత్త నాటకాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. ‘వారి దురదృష్టం ఏమిటంటే.. ప్రజలకు నిజం తెలుసు’ అని ప్రధాని బుధవారం ‘ఎక్స్’లో వరుస ట్వీట్లు చేశారు. అటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్, కిరెన్ రిజిజు కూడా షాకు అండగా నిలిచారు. తాను అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఒక్కనాటికీ మాట్లాడనని షా తేల్చిచెప్పారు. ‘అంబేద్కర్‌ను అవమానించిన., ఎస్సీ, ఎస్టీలను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ చీకటి చరిత్రను అమిత్‌షా పార్లమెంటులో బట్టబయలు చేశారు. ఏళ్ల తరబడి అధికారం అనుభవించి.. ఎస్సీ, ఎస్టీల సాధికారతకు చేసింది శూన్యం’ అని ప్రధాని విరుచుకుపడ్డారు. అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ చేసిన ‘పాపాల’ జాబితాను ఆయన విడుదల చేశారు. ‘ఎన్నికల్లో ఒకసారి కాదు.. రెండు సార్లు ఆయన్ను ఓడించారు. ఎలాగైనా ఆయన్ను ఓడించాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నెహ్రూయే స్వయంగా వ్యతిరేక ప్రచారం చేశారు. ఆయనకు భారతరత్నను తిరస్కరించారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆయన చిత్రపటాన్ని కూడా పెట్టలేదు. ఓ కుటుంబం సారథ్యంలోని ఒకానొక పార్టీ.. డాక్టర్ అంబేద్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు పన్నిన పన్నాగాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు’ అని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం చేసిన పనులను ప్రధాని ప్రస్తావించారు. బాబాసాహెబ్‌తో సంబంధం ఉన్న ఐదు చారిత్రక స్థలాలను.. ‘పంచతీర్థ’ పేరిట అభివృద్ధి చేశామన్నారు. ‘చైత్యభూమి వ్యవహారంలో దశాబ్దాల తరబడి స్థలం సమస్య పెండింగ్‌లో ఉంటే.. మేం దానిని పరిష్కరించాం.

## రంగంలోకి ఈడీ!

కాకినాడ సీపోర్టులో వాటాలను కారుచౌకగా కొట్టేసిన కేసు కీలక మలుపు తిరిగింది. ఇందులో లోగుట్టు వెలికి తీసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. జగన్ హయాంలో చోటు చేసుకున్న ఈ బలవంతపు డీల్ వెనుక భారీగా మనీ లాండరింగ్ జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. కాకినాడ సీపోర్టు అసలు యజమాని కేవీరావును జగన్ సన్నిహితులు బెదిరించి, భయపెట్టి కారుచౌకగా వాటాలు కొట్టేసిన వైనంపై ఈడీకి పలు ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. వాటిని పరిశీలించిన ఈడీ... ఈ ‘డీల్’లో మనీలాండరింగ్ చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టేందుకు విక్రాంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

**విక్రాంత్ ప్రత్యక్ష ప్రమేయం...**

జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు, గనులు, పోర్టులు చేతులు మారిపోయాయి. అందులో... కాకినాడ సీపోర్టు కూడా ఒకటి! ఇందులో 41శాతం వాటాను తాడేపల్లి పెద్దలకు బాగా దగ్గరైన ‘అరబిందో’ దక్కించుకుంది. తనను బెదిరించి, భయపెట్టి మరీ వాటాలు రాయించుకున్నారని పోర్టు యజమాని కేవీ రావు ఇటీవల సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి కాకినాడ సీపోర్టులో ఇటీవల సీఐడీ అధికారుల బృందం సోదాలు జరిపింది. బలవంతపు డీల్ వెనుక జరిగిన లావాదేవీలపై కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. కేవీరావు వాటాను కారుచౌకగా కొట్టేయడం, అరబిందో కంపెనీ పేరిట షేర్లను బలవంతంగా రాయించిన ఘటనలో వందల కోట్లు చేతులు మారాయని... మనీలాండరింగ్ జరిగిందని ఈడీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో... ఈ డీల్‌లో కీలక పాత్ర పోషించిన విక్రాంత్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

## పరిరక్షణకే భూభారతి

హైదరాబాద్: సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా ‘ఆర్వోఆర్ %-%భూభారతి’ చట్టాన్ని రూపొందించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 49 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్ఓఆర్ చట్టం అద్భుతంగా పనిచేసిందని.. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కొనసాగిందని చెప్పారు. కానీ నాలుగు గోడల మధ్య అసంబద్ధంగా రూపొందించిన ‘ధరణి’తో కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా పరిస్థితి తయారైందని విమర్శించారు. లక్షల మందిని నానా తిప్పలు పెట్టిన ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామన్న హామీని అమల్లోకి తెచ్చి... దాని స్థానంలో ప్రజల భూమి హక్కులను సంరక్షించే సరికొత్త భూభారతి చట్టాన్ని తెస్తున్నామని ప్రకటించారు. బుధవారం శాసనసభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగించారు. వివరాలు పొంగులేటి మాటల్లోనే... “కొత్త చట్టంపై ఆగస్టు 2న ముసాయిదా ప్రవేశపెట్టాం. 40 రోజుల పాటు వెబ్‌సైట్‌లో ఉంచి, చర్చావేదికలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, కవులు, మేధావులు, విశ్రాంత అధికారులు, సాధారణ ప్రజల సలహాలు, సూచనలు స్వీకరించి కొత్త చట్టాన్ని రూపొందించాం. మాజీ మంత్రి హరీశ్‌రావు వంటి వారు ఇచ్చిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం.



హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య కేంద్రములో జరిగిన తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ వార్షిక సర్వసభ్య సమావేశములో తెలంగాణ సహకార యూనియన్ లో వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీకి సభ్యత్వము కల్పించాలని తెలంగాణ సహకార యూనియన్ ఛైర్మెన్ మోహన్ రెడ్డికి వినతి పత్రము అందిచిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర అనంతరము తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచు తెలంగాణ రాష్టంలోని హౌసింగ్ సొసైటీలకు సభ్యత్వము కల్పించి ఒకే వేదిక పైకి తీసుకురావాలన్నారు

# కాళేశ్వరం నిర్ణయం కేసీఆర్, హరీశ్‌రావులదే!

**పీసీ ఘోష్ కమిషన్ ముందు మాజీ సీఎస్ ఎస్కే జోషి**

**మేడిగడ్డ వద్ద భూమిపూజ చేసిన రోజే ప్రాజెక్టు పేరు మార్చారు**

**మొత్తం 200కు పైగా పరిపాలనపరమైన అనుమతుల జారీ**

**మేడిగడ్డ వైఫల్యానికి కచ్చితమైన కారణాలు చెప్పలేను**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకున్నది నాటి సీఎం కేసీఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావులేనని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి చెప్పారు. నాటి సీఎం కేసీఆర్ అధ్యక్షతన వ్యాప్కోస్, సీఈ%-%సీడీఓ, ఇంజనీర్లతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 2016 మే 2న మేడిగడ్డ వద్ద భూమిపూజ చేసి బరాజ్‌ల నిర్మాణాన్ని కేసీఆర్ ప్రారంభించారని వివరించారు. అదే రోజు ప్రాణహిత%-%చేవెళ్ల ప్రాజెక్టు పేరును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చినట్టు వెల్లడించారు. కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ బుధవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఆయన పాల్గొన్నారు.

**సీఎం నిర్ణయాన్ని సాధారణంగా వ్యతిరేకించరు**

బరాజ్‌ల నిర్మాణంపై విధానపర నిర్ణయం ఎవరిది? అని కమిషన్ ప్రశ్నించగా, నాటి సీఎం నేతృత్వంలో మంత్రివర్గం, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.. అని తొలుత బదులిచ్చారు. నిర్ణయం మంత్రివర్గందా? సీఎందా? ప్రభుత్వం అంటే ఎవరు? అని కమిషన్ గుచ్చిగుచ్చి ప్రశ్నించగా, నిర్ణయం సీఎందేనని, మంత్రివర్గం బలపరిచిందని తెలిపారు. మంత్రివర్గ భేటీలో ఎవరైనా మంత్రి అసమ్మతి వ్యక్తం చేయలేదా? అని ప్రశ్నించగా, అలాంటి విషయం తన దృష్టికి రాలేదన్నారు. సీఎం నిర్ణయంపై అసమ్మతి తెలిపితే మరుసటి రోజే మంత్రి పదవి కోల్పోవాల్సి వస్తుందనే భావనతో ఎవరూ అలా చేయరన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌కి మహారాష్ట్ర అభ్యంతరాలు, వణ్యప్రాణి సంరక్షణ కేంద్రం ప్రతిబంధకాలుగా మారడం, తగిన నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) లేఖ రాయడంతో బరాజ్‌ను మేడిగడ్డకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎస్కే జోషి వివరణ ఇచ్చారు. మేడిగడ్డ బరాజ్ వైఫల్యానికి కచ్చితమైన కారణాలు చెప్పలేనని, డిజైన్లకు అనుగుణంగా నిర్మాణం జరగకపోవడం, నాణ్యతా లోపాలు, నిర్వహణ/పర్యవేక్షణ లోపాలు వంటి అనేక కారణాలు ఉండవచ్చని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేవలం ఒకే ఒక పరిపాలనపర అనుమతి జారీ చేయలేదని, సుమారు 200కి పైగా అనుమతులు జారీ చేశారని తెలిపారు.

# మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వం పచ్చిఅబద్ధాలు

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్: అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం మూ సీ ప్రాజెక్టుపై పచ్చి అబద్ధాలు చెబుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్‌కు సెప్టెంబర్‌లో పంపించిన ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని, కానీ, శాసనమండలి సాక్షిగా మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు సమాధానం చెప్పారని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుకు మూసీ కోసం ఋణం అడిగిన సాక్ష్యాధారాల నివేదికల ప్రతులను ఆమె విడుదల చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో రుణం కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని గుర్తు చేశారు.

# ఫార్ములా-ఈపై చర్చిద్దాం

**ముఖ్యమంత్రికికేటీఆర్ లేఖ**

**ఈ-రేస్‌వల్ల రాష్ట్రానికి 700 కోట్ల లబ్ధి**

**మీడియాకు సీఎంవో లీకులు ఇచ్చుడు కాదు**

**నాలుగు గోడల మధ్య చర్చ కన్నా.. నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరగాలి**

**ఏదో జరిగిందనే అపోహలు సృష్టించే ప్రయత్నం సరికాదు: కేటీఆర్**



హైదరాబాద్: ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై శాసనసభలో చర్చ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నాలుగు గోడల మధ్య చర్చ కన్నా ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. 'ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార ఆరోపణలు చేస్తున్నది. ఇదే విషయంపై ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్నివర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరిందని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దానిని ఏకపక్షంగా రద్దు చేసింది. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగిందనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది.

**ఒప్పందం పారదర్శకం**

నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని ఇదివరకే నేను వివరంగా చెప్పాను. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హకు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసనసభ వేదికగా చెప్తాం. శాసనసభ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేసును కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి' అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

**స్పీకర్‌కు బీఆర్ఎస్ఎల్పీ వినతి**

ఫార్ములా-ఈ రేసింగ్ వ్యవహారంపై ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని బీఆర్ఎస్ శాసనసభా పక్షం స్పీకర్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో కేటీఆర్ ఎటువంటి పొరపాట్లు చేయలేదని అన్నారు. నిబంధనల మేరకే నిర్వాహకులకు చెల్లింపులు జరిపినట్టు కేటీఆర్ ఇప్పటికే స్పష్టంచేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం మాత్రం ఫార్ములా-ఈ రేసింగ్ వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ కక్షపూరితంగా బీఆర్ఎస్ పార్టీపై, కేటీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు.


# ధరణి ముసుగులో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం

**వాటి విలువ రూ.1.5 లక్షల కోట్లు ఉంటుంది**

**ప్రభుత్వ, ఇనాం, పడావు భూములు చేతులు మారాయి**

**వీటికి సంబంధించి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం**

**మీడియాతో చిట్‌చాట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**




హైదరాబాద్: ధరణి ముసుగులో విలువైన ప్రభుత్వ, ఇనాం, పడావు, ఎవాక్యుయి భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని ప్రభుత్వం గుర్తించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అన్యాక్రాంతమైన ఈ భూములను ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దాదాపు పదిహేను వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని, చేతులు మారాయని తేలిందని.. కనిష్టంగా ఒక ఎకరా రూ.10 కోట్లు అని అనుకున్నా వీటి విలువ దాదాపు రూ.1.5 లక్షల కోట్లు ఉంటుందని చెప్పారు. బుధవారం శాసనసభలోని తన కార్యాలయంలో భట్టి మీడియాతో ముచ్చటించారు. 10 వేల ఎకరాలు ధారాదత్తం చేశారు 'అన్యాక్రాంతమైన భూములే కాకుండా అస్సైన్డ్ భూములను కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకుంటే.. మళ్లీ ప్రభుత్వ అవసరాల కోసమే వినియోగించాలి. కానీ ఇబ్రహీంపట్నం మండలంలో పది వేల ఎకరాలను ధారాదత్తం చేశారు. గతంలో భూముల రిజిస్ట్రేషన్ అనంతరం రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే ఆ భూముల మ్యుటేషన్ జరిగి పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చేవి. కానీ ధరణి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ కాగానే వెంటనే మ్యుటేషన్ అవడం, ధరణి పోర్టల్‌లో వేలిముద్రలు, ఫోటో రాగానే.. అక్కడికక్కడే ఇతరులకు విక్రయించడం వల్ల అసలు ఆ భూముల చరిత్ర తెలియకుండానే క్రయ విక్రయాలు, మ్యుటేషన్లు జరిగిపోయాయి.ఇనాం, పడావు, ఎవాక్యుయి ప్రాపర్టీ, ప్రభుత్వ భూములను ధరణిలో ఎంట్రీ చేసే సమయంలోనే పేర్లు మారిపోయాయి. ఒకసారి ధరిణిలో ఎంటర్ అయ్యాక వాటిని మార్చే అవకాశం లేకుండా పోయింది. కొన్నింటిని కావాలనే పార్ట్ 'బీ'లో చేర్చారు. దీనిని అడ్డు పెట్టుకుని పెద్ద ఎత్తున భూములు చేతులు మారాయి. ధరణిలో ఒక్క భూ యజమాని పేరు మినహా కాస్తుదారులు/ అనుభవదారుల కాలమ్ లేకపోవడంతో ఇష్టానుసారం భూములు చేతులు మారాయి..'అని డిప్యూటీ సీఎం చెప్పారు.

# పట్నం నరేందర్‌రెడ్డి సహా 'లగచర్ల' నిందితులందరికీ బెయిల్



హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. లగచర్ల కేసులో నాంపల్లి స్పెషల్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆయనతో సహా మరో 24 మంది నిందితులకు బెయిల్ లభించింది.లగచర్ల కేసులో నిందితులు దాదాపు నెలకు పైగానే జైల్లో ఉన్నారు. మరోవైపు మూడు నెలలపాటు ప్రతీ బుధవారం విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. పట్నంకు రూ.50వేల షూరిటీ, అలాగే మిగతా వాళ్లకు రూ.20వేలతో రెండు షూరిటీలు సమర్పించాలని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. నవంబర్ 11వ తేదీన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై దాడి జరిగింది. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ కోసం జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికారులు వచ్చిన సమయంలో కొందరు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. పలువురు గ్రామస్తులను అరెస్ట్ చేశారు. అయితే ఈ ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణల నేపథ్యంలో.. ఆయన్ని హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తుండగా పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు.

# నార్వేలో 'మాస్ జాతర'






రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు తెరకెక్కిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నార్వేలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభం చుకుందని సమాచారం. ప్రస్తుతం అక్కడి మంచు ప్రదేశాల్లో కీలక సన్నివేశాలతో పాటు ఓ పాటను చిత్రీకరించనున్నట్లు తెలిసింది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబ వుతున్న ఈ సినిమాలో రవితేజ ఆర్పీఎఫ్ అధికారిగా సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఇది ఆయనకు 75వ సినిమా. వచ్చే ఏడాది మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.



# నటిగా రాణిస్తున్నందుకు గర్విస్తున్నా!

హాలీవుడ్ చిత్రాలతో తీరిక లేకుండా గడుపుతున్న అందాల తార ప్రియాంక చోప్రా.. మళ్లీ ఎప్పుడెప్పుడు బాలీవుడ్ తెరపై సందడి చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు అభిమానులు. ఇప్పుడు వారందరికీ ఓ తీపి కబురు వినిపించింది ప్రియాంక. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. వచ్చే ఏడాది ఒక హిందీ చిత్రాన్ని ప్రకటించబోతున్నట్లు తెలిపింది. “భారతీయ సినిమాలు ఎప్పుడూ నా హృదయానికి దగ్గరగానే ఉంటాయి. అందుకే నా అభిమానులతో పాటు నాకు కూడా బాలీవుడ్‌లోకి తిరిగి రావాలని ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం ఒక హిందీ సినిమాకు సంతకం చేసే పనిలోనే ఉన్నా. ఈ ప్రాజెక్టు కోసం ప్రేక్షకులందరూ ఎక్కువ రోజులు వేచి ఉండాల్సిన అవసరం లేదు. మీ అందరి అంచనాలను మించేలా ఉంటుందీ చిత్రం. వచ్చే ఏడాది పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటిస్తా” అని అంది. తన సినీప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ.. “18ఏళ్లకే నేను సినీ పరిశ్రమలో అడుగుపెట్టా. అప్పటి నుంచి ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. నటిగా రాణిస్తున్నందుకు గర్వపడుతున్నా. ఇన్నేళ్ల నా ప్రయాణంలో ఎన్నో అనుభవాలను, జ్ఞాపకాలను పోగుచేసుకున్నాన”ని చెప్పుకొచ్చింది.



# విక్రమ్.. కొత్త కబురు

కథానాయకుడు విక్రమ్ కొత్త కబురు వినిపించారు. తన 63వ చిత్రాన్ని మడోన్ అశ్విన్ దర్శకత్వంలో చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. 'మండేలా', 'మావీరన్' (తెలుగులో 'మహావీరుడు') విజయాల తర్వాత అశ్విన్ తెరకెక్కించనున్న సినిమా ఇది. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత అరుణ్ మాట్లాడుతూ.. “అశ్విన్‌తో మాకిది రెండో సినిమా. విక్రమ్‌కు సరిపోయే కథతో.. ఆయన్ని సరికొత్త అవతారంలో చూపించే విధంగా ఈ చిత్రం చేయనున్నాం. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఇది తప్పకుండా ప్రేక్షకులకు ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించే సినిమా అవుతుంది” అన్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.



'ఆల్ఫా'లో అవకాశం రావడం గౌరవమే కాదు బాధ్యత అంటోంది బాలీవుడ్ కథానాయిక శార్వరీ వాఘ్. ఈ ఏడాది 'ముంజ్యా', 'వేదా' చిత్రాలతో మంచి విజయాల్ని తన ఖాతాలో వేసుకుందీమె. ఇప్పుడు అలియా భట్‌తో కలిసి 'ఆల్ఫా'తో అలరించడానికి సిద్ధమైంది. శివ్ రావేల్ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శార్వరీ.. ఇందులో నటించడం గురించి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. “యశ్‌రాజ్ ఫిలింస్ నిర్మించిన ఎన్నో భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో

# నా పనితోనే సమాధానం చెప్తా!

గూఢచారులుగా నటించిన సూపర్‌స్టార్లకు నేను పెద్ద అభిమానిని. ఈ స్పై కుటుంబంలో అతి తక్కువ వయసులోనే నాకు అవకాశం రావడం ప్రత్యేకంగా అనిపిస్తుంది. గూఢచారిగా నటించాలన్న కల 'ఆల్ఫా'తో నిజమైంది. ఆదిత్య చోప్రా నాకు ఇచ్చిన ఈ గొప్ప అవకాశాన్ని నేను సద్వినియోగం చేసుకుంటాను. నా పనితోనే అందరికీ సమాధానం చెప్తాన”ని చెప్పుకొచ్చింది. శివ్ రావేల్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది డిసెంబరు 25న విడుదల కానుంది.



# 'సంక్రాంతికి వస్తున్నాం'

వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్‌రావిపూడి దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచారు. శుక్రవారం వెంకటేష్ పుట్టిన రోజు సందర్భంగా సెకండ్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు. ఇందులో నాయకానాయికలు వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్యరాజేష్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. ఈ సినిమాలో వెంకటేష్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు.



# పోలీస్ పాత్ర నాకు చాలా ప్రత్యేకం

రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై రూపొందిన బ్లాక్‌బస్టర్ 'మర్దానీ'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ సినిమాకు 2019లో సీక్వెల్‌గా 'మర్దానీ 2' విడుదలైంది. ఈ రెండూ బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను అందుకున్నాయి. 'మర్దానీ 2' విడుదలై శుక్రవారానికి అయిదేండ్లు పూర్తయిన సందర్భంగా 'మర్దానీ 3'కి సంబంధించిన మేకింగ్ వీడియోను యష్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేసింది. ఇందులో రాణి ముఖర్జీ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీరాయ్ పాత్రలో కనిపించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ 'వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 'మర్దానీ-3' షూటింగ్ మొదలుపెట్టబోతున్నాం. పోలీస్ డ్రెస్ వేసుకొని అద్భుతమైన పాత్ర చేయడం నాకెప్పుడూ ప్రత్యేకమే.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707